# టెర్లిన్ చీర

వినుగ్గా పేనా కిందపెట్టి మెటికలు విరుచుకున్నాడు రాజు. ఓసారి రెండు చేతులూ పైకెత్తి గట్టిగా ఊపిరి పీల్చుకుని విడిచాడు. చుట్టూ చూశాడు. తోటి గుమాస్తా లందరూ యంత్రాల్లా తమ పని తాము చేసుకు పోతున్నారు. మళ్ళీ ఫైళ్ళలోకి తల దూర్చబోతూ, ఆగాడు అప్పుడే ప్రక్కకు చూసిన రాజు. అతని కళ్ళముందు భాస్కర్ వేసుకుని వున్న టెర్లిన్ షర్ట్ మిలమిలా మెరిసింది.

"భాస్కర్ చస్తే బావుణ్ణు" కసిగా అనుకున్నాడు. వాడుచస్తే రాజుకు ఒనగూడేదేమీ లేదని అతనికి తెలుసు. కాని వాడు బతికుండి రాజును అసూయానలంలో భగ్గున మండిస్తున్నాడు. అందుకే వాడు చావాలి.

ఎప్పుడూ టెర్లిన్ షర్టులే. సిల్కు ప్యాంటులే. వాటన్నిటికీ డబ్బెక్కడి నుండి వస్తుందో అందరికీ తెలుసు. చాలా బాగా తెలుసు. వెధవ బతుకూ వాడూను. లంచాలు తింటాడు. నిజానికి అందరూ తింటారు. కాని తాను తినలేక పోతున్నాడు. నిజానికి తనదే వెధవ బతుకేమో!

అసలు వాడు అన్నిట్లోనూ అదృష్టవంతుడే. రంభలా వుంటుంది వాడి పెళ్ళాం. ఈర్ష్యగా పళ్ళు కొరుక్కున్నాడు రాజు. వాడిపెళ్ళాం శారద కళ్ళముందు కదిలింది ఎగతాళిగా నవ్వుతూ. నువ్వు చస్తే బావుణ్ను అనుకున్నాడు కసిగా.

వాడి పెళ్ళాంతోబాటు రాజు పెళ్ళాం కూడా కనిపించింది రాజుకు. కమల నవ్వుతూవుంది. పాపం అనిపించింది రాజుకు. కమల కూడా అందమైనదే. కాని ఏం లాభం అలంకరణ లేని అందం రాణించదుగా. తన కొచ్చే నూటిరవైలో తానూ భార్యా తల్లీ తండ్రీ నల్గురు బ్రతకాలి. ఇంకా నయం.

---


*ద్వితీయ బహుమతి రూ. 25*

## ఎన్. ఐ. సుధాకరరావు

ఫస్ట్ బి. యస్ సి.
యస్. జి. వి. ఆర్ట్స్ కాలేజీ,తిరుపతి.




తాను కాస్త జాగ్రత్తపడుతున్నాడు. లేకపోతే ఈ నాలుగేళ్ళలో కనీసం ఇద్దరు బిడ్డలయినా వుండేవాళ్ళు. మూలిగే నక్కపై తాటికాయ పడట్టయి వుండేది. మళ్ళీ యిటు చూశాడు రాజు. భాస్కరం బ్లూ టెర్లిన్ షర్టు వెక్కిరించింది. ఈసారి రాజు భాస్కరం పైన కోప గించుకోలేదు. తనపై తానే కోప గించుకున్నాడు. కమలదాదాపుసంవత్సరం నుండీ ఒక్కగానొక్క కోరిక కోరుతోంది టెర్లిన్ చీర కావాలని. ముప్పైఫ రూపాయలట. కడుపు మండిపోయింది రాజుకు. అణుచుకున్నాడు మెల్లగా.

కాకి షర్టూ పాంటూ వేసుకున్న, పోస్టుమేన్ వచ్చి, టపా చేతికిచ్చి వెళ్ళాడు. అప్పుడు వాడి చేతివైపు చూశాడు రాజు. వాడి చేతికి ఫేవర్లూబా వాచీ! ఉడుక్కున్నాడు రాజు.

ఆలోచనల నాపాడు.

కసిగా ఫైలు తెరిచి తన పని తాను చేసుకు పోతున్నాడు.

ఆఫీసర్ బూట్లు టకటక లాడించుకుంటూ హాల్లోకి వొచ్చాడు.

యంత్రాలేవీ తలెత్తలేదు. తమ పని తాము చేసుకు పోతున్నాయి.

"హియర్!" ఆఫీసర్ పిలుపు.

అందరూ లేచి నిల్చి తల లాతని వైపు తిప్పి, చెవులు విప్పారు.

"మన ప్రొప్రయిటర్ గారికి రేస్‌లో రెండు లక్ష లొచ్చింది. ఈ క్షణమే అందరికీ తలా ఒకనెల బోనసివ్వ మన్నారు. కమ్ టు మై రూమ్ వన్ బై వన్."

గంభీరంగా లోపలి కెళ్ళి పోయాడు ఆఫీసర్.

దానకర్ణుడు మన ప్రొప్రయిటర్ అనుకున్నారు.

ఆఫీస్ రూమ్‌లోంచి బయటికి వచ్చిన రాజు ఆలోచనలో పడ్డాడు.

ఏభై రూపాయలు అంగడి కిచ్చెయ్యాలి. ఇంకా... ఇంకా... ఎస్టిమేట్లు వేశాడు.

కమలకి టెర్లిన్ చీర కొనాలి. సినిమా కెళ్ళాలి.

వచ్చి సీట్లో కూర్చున్నాడు.

ఆఫీసయి పోయింది.

బజార్న పడ్డాడు.

టెర్లిన్ చీర కొన్నాడు.

నడుస్తున్నాడు ఇంటికి.

ఓ కథ జ్ఞాపకం వొచ్చింది "ఎవరో యిలాగే భార్యకు కానుక కొనుక్కు వెళ్తూ దారిలో లారీ కిందపడి చచ్చాట్ట.

జాగ్రత్తగా నడుస్తున్నాడు.

ఇంకో కథ జ్ఞాపకం వొచ్చింది. అలాగే యింకోడు భార్యకి బహుమతి తీసుకెళ్తే, ఇంటికెళ్ళేసరికి ఆమె చచ్చిపోయి వుందట.

'మే గా డ్ ఫర్‌బిడిట్' అను కున్నాడు.

అతని మనసు ఆశుభమేదో శంకిస్తోంది.

మెల్లగా నడుస్తున్నాడు ప్యాకెట్ భద్రంగా పట్టుకుని.

సాయంత్రం అరయింది. బజారు రద్దీగా వుంది. రద్దీలో అందమైన ఆడపిల్లల్ని మింగేలా చూస్తూ నడిచే రాజు తలవంచుకుని జాగ్రత్తగా నడుస్తున్నాడు.

మెల్లగా ఇల్లు చేరాడు.

నేరుగా షెల్ఫువద్దకువెళ్ళి తెచ్చి నవి షెల్ఫులో పెట్టేశాడు. వొచ్చి చిన్న స్టూలుపై కూర్చున్నాడు.

ఎవరూ తన రాక చూళ్ళేదింకా.

అప్పుడే యింట్లోంచి వచ్చాడు రాజు నాన్న.

"కమలేది నాన్నా !"

"వాళ్ళత్తా, కమలా కలిసి గుడి కెళ్ళారు."

షర్టు వేసుకొని అలా రామయ్యింటి దాకా వెళ్ళొస్తారా' అని వెళ్ళిపోయా డాయన.

నిన్న సగం చదివి ఆపి వుంచిన బాడుగ నవలతీసి చదవసాగాడు రాజు.

● ● ●

పెద్దాళ్ళిద్దరూ హాల్లో గురక తీస్తున్నారు.

హాలు ప్రక్కనున్న చిన్న గదిలో పరుపుపై వెల్లకిలా పండుకొని కమలకి సంగతి ఏ విధంగా చెప్పి పండగైపోయేలా చెయ్యాలా ? అనుకుంటూ ఆలోచిస్తున్నాడు రాజు.

కమల లోనికి వచ్చింది. రాజు ప్రక్క చోటు చేసుకుంది.

"కమలా ! నీకో మంచి సంగతి చెప్పనా ?"

"ఉండండి! నేనో సంగతి చెబుతా వింటారా ?" అంది కమల గోముగా అతని వైపు చూస్తూ.

అయిపోయాడు రాజు ! "చెప్పు !" అన్నాడు ఆమెని దగ్గరికి లాక్కుంటూ.

"మరే, హాయిదాల పద్ధతిపై చీరలమ్మే వాడి దగ్గర ఓ టెర్లిన్ చీర కొన్నానండీ, ముప్పై అయిదుట, నెలనెలా అయిదిచ్చి తీర్చెయ్యాలి. మంచిదే కదండీ! మెల్లిగా తీర్చుకుందాం. సరేనా !" గోముగా అంటోంది కమల.

మనసులోనే నెత్తీ నోరూ కొట్టుకున్నాడు రాజు—ఇంకేమీ చెయ్యలేక.

□□□